నిరసన జ్వాలలు

- పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు..
- సంఘీభావంగా నేతల నిరసన, మానవహారాలు


అల్లిపురం సచివాలయం వద్ద పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు


మనోరమా థియేటర్ జంక్షన్ వద్ద వలంటీర్ల మానవహారం

దాబాగార్డెన్స్ : వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. అలాంటి వలంటీర్లపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నోరు పారేసుకోవడంపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లను ద్దేశించి ఏలూరు సభలో పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. వలంటీర్లకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు అండగా నిలిచారు. తన సినిమాల్లో మహిళల పట్ల సభ్యత, సంస్కారం ఉన్నట్లు నటించడమే తప్ప నిజ జీవితంలో ఎక్కడా మహిళలను గౌరవిస్తున్న దాఖలాల్లేవంటూ మండిపడ్డారు. వలంటీర్లలో 70 శాతం మంది మహిళలే ఉన్నప్పటికీ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం సాయంత్రం నిరసనలు చేపట్టారు. మానవహారం నిర్వహించారు.

34వ వార్డు పరిధిలో..

34వ వార్డు పరిధిలో గల వలంటీర్ల సమక్షంలో నిరసన ర్యాలీ చేపట్టి, మానవహారం జరిపారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. లేదంటే ఆదర్శంగా నిలిచిన వలంటీర్లే తగిన బుద్ధి చెబుతారంటూ వలంటీర్ వెంకటేష్, నాగమణి, శాంతి, జేసీఎస్ కన్వీనర్ నీలకంఠం, పార్టీ సీనియర్ నాయకులు లింగం శ్రీనివాస్, లండ రమణ, దూడ అప్పారావు, తాతబ్బాయి, యాచలపు రాజు హెచ్చరించారు.

32వ వార్డులో..

32వ వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి నేతృత్వంలో అల్లిపురం సచివాలయం వద్ద పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మూలే రామిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో బోని దేవా పలువురు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశాం



సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం. వలంటీర్లు చేస్తున్నది ఉద్యోగంగా భావించకండి. ఒక సేవగా భావించండి. కోవిడ్ సమయంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వణికిపోతున్నా రాష్ట్రంలో మాత్రం వలంటీర్లు చేసిన సేవలు నిరుపమానం. ఇంటింటికి వెళ్లి కోవిడ్ రోగులను గుర్తించి మందులు అందించడమే గాక వారికి ప్రాణభిక్ష పెట్టిన సేవాతత్పరులు. అటువంటి వలంటీర్లను కూలీలు, గోనె సంచులు మోసేవాళ్లు అంటు హేళనగా చంద్రబాబునాయుడు మాట్లాడితే.. పవన్ కల్యాణ్ వలంటీర్లపై సిగ్గుమాలిన మాటలు మాట్లాడడం అవివేకం.

–గంగుల మానస, వుడ్‌యార్డ్ సచివాలయం

నిస్వార్థంగా సేవ చేస్తున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు సహా పలు పథకాలను ప్రజల ఇంటి వద్దే అందిస్తూ నిజాయితీగా సేవ చేస్తున్నాం. మేము చేస్తున్న పనిని ఉద్యోగంలా కాకుండా సేవలా భావించి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నాం. మంచం పట్టిన వారిని సైతం ఆప్యాయంగా పలకరిస్తూ కుల, మత, పార్టీలకతీతంగా, వివక్ష, పక్షపాతం చూపకుండా నిస్వార్థంగా పని చేస్తున్నాం. కోవిడ్ సమయంలో సైతం ప్రాణాలకు తెగించి ప్రజలకు ధైర్యం చెబుతూ అహర్నిశలు ప్రజల క్షేమాన్ని కోరుకున్నాం. అటువంటి వలంటీర్లను పవన్‌కళ్యాణ్ తప్పుడు మాటలు అనడం సరికాదు. వెంటనే తన మాటలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– కంచుబోయిన జస్వంత్ యాదవ్, వలంటీర్

ఆప్యాయంగా ఆదుకుంటున్నారు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ప్రభుత్వ లక్ష్యాలను సాకారం చేస్తూ ప్రభుత్వ ఫలాలను ప్రజలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. తెల్లవారగానే ఆప్యాయంగా పలకరిస్తూ విధి నిర్వహణలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా లెక్క చేయకుండా సేవ చేస్తున్నాం. అటువంటి వలంటీర్లను తప్పుడు మాటాలు మాట్లాడడం జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు సరికాదు.

– దుంపా గుణవతి, కుమ్మరవీధి సచివాలయం

వలంటీర్లకు బయోమెట్రిక్ పరికరాల పంపిణీ


వలంటీర్లకు బయోమెట్రిక్ డివైజులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

దాబాగార్డెన్స్ : పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమని, అటువంటి వలంటీర్లపై పవన్ కళ్యాణ్ నోటికొచ్చినట్టు మాట్లాడడం సమంజసం కాదని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ విమర్శించారు. అల్లిపురం మెట్ట వద్ద వైఎస్సార్ సీపీ జీసీఎస్ మండల ఇన్‌చార్జి కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో వార్డు సచివాలయ వలంటీర్లకు విలువైన బయోమెట్రిక్ డివైజులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. చక్కటి సేవా కార్యక్రమానికి చేయూతనిచ్చిన నీలకంఠంను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా నీలకంఠం మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వృద్ధులకు పెన్షన్ అందించడం, వివిధ పథకాలు పేదలకు చేరవేయాలంటే బయోమెట్రిక్ మిషన్లు ఎంతో అవసరమన్నారు. అటువంటి బృహత్తర కార్యక్రమానికి తన వంతు ఈ మిషన్లు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, వార్డు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

35వ వార్డులో అభివృద్ధి పనులు


కల్లుపాకల వద్ద అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ విల్లూరి


పూర్ణామార్కెట్ వద్ద సీసీ రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులో పలు అభివృద్ధి పనులు మంగళవారం ప్రారంభం అయ్యాయి. వార్డులో కల్లుపాకల వద్ద ఎన్నో ఏళ్లుగా ఉన్న అంగన్‌వాడీ భవనం వద్ద అసంపూర్తిగా వదిలేసిన సీసీ రహదారి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పూర్ణామార్కెట్ సహా ఏ వీధులోను అభివృద్ధి జరగలేదన్నారు. దీని వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా వార్డులో తాగునీరు సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య, రహదారుల నిర్మాణంతో పాటు పూర్ణామార్కెట్‌లో విద్యుత్, ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలకు మంజూరు చేసిన రూ. 20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలందరూ ఈ అభివృద్ధిని చూస్తున్నారని రాబోయే ఎన్నికల్లో జగనన్ననే మళ్లీ గెలిపించుకుని మరింత అభివృద్ధి చేయించుకోవాలని విల్లూరి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం


లింగ సమానత్వంపై మాట్లాడుతున్న ఏఎంసీ ప్రతినిధి

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. కళాశాల అర్థశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని ప్రపంచంలో జనాభా పెరుగుదల వల్ల కలిగే పరిణామాలను విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా లింగ సమానత్వం అనే అంశంపై ఆంధ్రా మెడికల్ కళాశాల అవగాహన సదస్సు నిర్వహించింది. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కేఎల్ శిరీష, అధ్యాపకురాలు డాక్టర్ కె. గీతాంజలి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు డాక్టర్ ఏడీ పుష్పలత, అనురాధ, డాక్టర్ బి. హైమావతి, ఆంధ్రా మెడికల్ కళాశాల నుంచి డాక్టర్ ఎస్. సుష్మ, డాక్టర్ చంద్రిక, మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల అరెస్ట్.. విడుదల


కార్మిక నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సీతమ్మధార : అంగన్‌వాడీలకు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఏపీ కమిటీ పిలుపు మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 36 గంటల పాటు అంగన్‌వాడీలు నల్లచీరలు ధరించి దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 11 గంటలకు అంగన్‌వాడీలు కలెక్టరేట్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న సమయంలో పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి బ్యారెక్స్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో జగ్గునాయుడు, అప్పలరాజు, బి.జగన్, ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో పాటు పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ శాంతియుతంగా కలెక్టరేట్‌కు వెళ్తుంటే పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కన్న అదనంగా వెయ్యి వేతనం పెంచాలని, మూడు వందలు జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకులు కె.బృంద, పి.మణి, వై.తులసి, ఎల్.దేవి, ఆర్.శోభరాణి, కె.పద్మావతి, ఆర్.నాగేశ్వరి, ఎం.వెంకటలక్ష్మి, బి.భవాని, వై.శ్రీదేవి, నూకరత్నం, బి.ఈశ్వరమ్మ, పాపవేణి, ఎ.సత్య, ఎల్.ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

13న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 13న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం


బాలుడికి ఆర్థిక సహాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ : అనారోగ్యంతో బాధపడుతున్న దేవాన్స్ అనే బాలుడికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సహాయం చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కర్రి వీర్రాజు అనే కార్యకర్త కుమారుడు గత కొద్ది రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే ఆ బాలుడి తండ్రికి ఫోన్ చేశారు. బాలుడి వైద్య పరీక్షలకు సంబంధించిన డబ్బులు అందజేస్తాను అని చెప్పడంతో మంగళవారం జరిగిన ప్రజాదర్బార్‌కు వచ్చిన బాలుడి తండ్రి వీర్రాజుకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అండగ ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మినిస్టీరియల్ స్టాఫ్ సేవలు వెలకట్టలేనివి


సన్మాన గ్రహీతలతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తదితరులు

మహారాణిపేట : మినిస్టీరియల్ విభాగం ఆస్పత్రి పరిపాలనకు గుండెకాయ వంటిదని, ఈ విభాగం శక్తివంతంగా ఉంటేనే ఆస్పత్రిలో అన్ని విభాగాలు సమర్థవంతంగా పని చేస్తాయని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ అన్నారు. మంగళవారం కేజీహెచ్ ఆవరణలో బదిలీపై వెళ్లిన ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ నిబంధనలు సక్రమంగా పాటించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరు నిరంతరం కష్టపడి పని చేయాలన్నారు. సర్వీసులో ఉద్యోగులకు బదిలీలు సాధారణం అని కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. మినిస్టీరియల్ సిబ్బంది తెర వెనుక హీరోలని అన్నారు. అకౌంటెంట్ జోగిరాజు, మేనేజర్ ఎస్ఎస్‌శర్మ, అకౌంటెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను సన్మానించారు.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

వైభవంగా రాచపోలమాంబ పండగ

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


రాజపోలమాంబ అమ్మవారు


ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


దాబాగార్డెన్స్ : భక్తుల కొంగుబంగారం, అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీ రాచపోలమాంబ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా చేపట్టారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. గోకుల్ థియేటర్ దరి అమ్మవారి ప్రధాన దేవాలయంతో పాటు, మెయిన్‌రోడ్డు సదనం పట్టు వద్ద గల ఉపాలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అల్లిపురంతో పాటు, బంగారుమెట్ట, వెంకటేశ్వర మెట్ట, కొబ్బరితోట, భూపేష్‌నగర్, నేరెళ్లకోనేరు, పూర్ణామార్కెట్, కనకలదిబ్బ, గొల్లలపాలెం, యల్లమ్మతోట తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అల్లిపురం పురవీధులతో పాటు, ఉపాలయం, ప్రధాన దేవాలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం పలుకూడళ్లలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కుమ్మరవీధి అమ్మవారి పుట్టింటి నుండి అమ్మవారి తిరువీధి ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అష్టలక్ష్మి, తీన్‌మార్, పులివేషాలు, తప్పిటగుళ్లు, సాముగరిడీలు, మహిళల కోలాటం సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత నెల 20న ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 20 వరకు నిర్వహించనున్నామని, ప్రధాన పండగ మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 32వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మూలే రామిరెడ్డి, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం, మంగపతిరావు, రాములమ్మ, కృష్ణవేణి, బోని దేవా, బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్, భానుమూర్తి, నీరజ్, రామరాజు ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు, కార్యదర్శి తిలక్, కోశాధికారి జగదీష్, మజ్జి రామకృష్ణ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

23న ప్రజా సింహగర్జన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రయాదవ్ తదితరులు

దాబాగార్డెన్స్ : బీసీలకు రాజ్యాధికారం వచ్చేలా త్వరలో నూతన పార్టీ ఆవిర్భావం జరుగుతుందని బీసీ జాతీయ నేత బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం అనకాపల్లి జిల్లా భారతీయ యాదవ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ మొల్లి సన్నిబాబు నిర్వహించిన నూతన పార్టీ ఆవిర్భావ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న దళిత, బహుజన, రైతు, శ్రామిక, మైనార్టీ, వెనుకబడిన కులాల రాజ్యాధికారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. గుంటూరు..విజయవాడ జాతీయ రహదారి నాగార్జున విశ్వ విద్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ప్రజా చైతన్య వేదికకు పెద్ద ఎత్తున ఆయా వర్గాల ప్రజలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నమ్మి అప్పలరాజు, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కిలాడి అప్పలరాజు తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది. చిత్రంలో కార్పొరేటర్ మేరీజోన్స్, మాసిపోగు రాజు తదితరులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గీతం మెడికల్ కళాశాల సహకారంతో డాక్టర్ మనీష్‌కుమార్, ప్రొఫెసర్, కళాశాల డెంటల్ విభాగాధిపతి డాక్టర్ నిషిత వైద్య బృందంతో నిర్వహించిన వైద్య శిబిరంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఏవీఎన్ కళాశాల డౌన్‌రోడ్డులో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో సచివాయ కన్వీనర్ కుందేటి సుధాకర్, ఈశ్వర్ కిషోర్, చెన్నా శ్రీధర్, కడియం ప్రసాద్, కేవీ నర్సింగ్, వర్మ, వంగలపూడి శ్రీనివాస్, దాసరి శివయ్య, స్మిత్, మూర్తి, నర్సింగ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌లూమ్ శారీ వాక్ కరపత్రం ఆవిష్కరణ

మురళీనగర్: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హ్యాండ్‌లూమ్ శారీ వాక్ కరపత్రాన్ని మహిళా రక్షణ సెల్ చైర్‌పర్సన్ ఎం.బూదమ్మ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.రామాంజనేయులు, కె.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టం పజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజాదర్బార్‌లో సమస్యల నివేదన


ఫిషింగ్ హార్బర్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ కమిషనర్, సీఎం పేషీలోని ప్రిన్సిపల్ సెక్రటరీకి పెండింగ్‌లో ఉన్న ఆయిల్ సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. ఇతర సమస్యలపై కూడా వినతిపత్రాలు స్వీకరించారు. మత్స్యకార సంఘాల నాయకులు బర్రె కొండబాబు, పీసీ అప్పారావు, వీరన్న, బుజ్జి లక్ష్మణరావు, మున్నం బాలాజీ, కింగ్ ఫిషర్ రాజు, వైఎస్సార్‌సీపీ 38వ వార్డు నాయకుడు సన్యాసిరావు, స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర, ఎస్‌కేఎంఎల్ ట్రస్టీ బెహరా వెంకటరత్నం, లండ రమణ, బొగ్గు శ్యామ్, గుజరావు రవి, చింతకాయల వాసు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నా రు. అనంతరం హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలను వ్యతిరేకిస్తూ రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

లక్ష్మీ టాకీస్ వద్ద..

జగదాంబ : మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు సీట్లు, కళాశాలల్లో అడ్మిషన్లు, ఇళ్ల స్థలాలు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల మంజూరు వంటి సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు సమర్పించగా.. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, కనకమహాలక్ష్మి దేవాలయ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 30వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దశమంతుల మాణిక్యలరావు, సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోని దేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.